అపూర్వకోరిక

కోమలాదేవి

పక్షుల కిలకిలారావాలతో పిల్లల అరుపులతో ఆ గృహప్రాంగణం ఎంతో సందడిగా ఉంది

పిల్లలు అల్లీ బిల్లీ తిరుగుతున్నారు అదొహ లోకం! చిన్నారిలోకం! ఆ రాజ్యంలో ప్రవేశించటానికి పెద్దలకు అర్హత లేనట్లు గేటుకు తాళం వేసుంది

వీధిలో నుంచున్న రాజు గేట్‌లోంచి చూస్తున్నాడు పిల్లలు అతణ్ణి గమనించే స్థితిలోలేరు పరుగులు — నవ్వులు — ఆటల్లో ఎగస్వాస — దెబ్బలాటలతో సరిపోయింది అతడొక పావుగంట చూచి గేట్‌మీద చప్పుడుచేశాడు అంతా ఆరేళ్ళలోపువారే

రెండవసారి శబ్దం విని ఒక జంట గేట్‌ను సమీపించింది "పైడ్ పైపర్" లా ఆడుతోన్న పిల్లలంతా ఆటలు ఆపుజేసి ఆ జంట వెనకాతల ప్రోగయ్యారు పిల్లలు ఉత్సుకతతో చూస్తున్నారు ఇతడేదో క్రొత్త అంకల్లా ఉన్నాడు క్రొత్తగా వచ్చారేమొ! ఈఁడికి తప్పకుండా పిల్లలుంటారు చిన్నపిల్లలు పెద్దవాళ్ళవైపు చూస్తున్నారు

"ఇంట్లో వినుతగారున్నారా"

"ఓ ఉన్నారు" అన్నాడొకడు

"మా అమ్మ" అంది ఒక ఆరేళ్ళపాప

ఆ పాపని పరీక్షగా చూచి చిన్నగా నవ్వాడు ఆ పిల్ల సిగ్గుతో వెనక్కి వెళ్ళింది

"నేను లోపలికి రావాలండ్రా" అనగానే ఒకరు పరిగెత్తుకుని వెళ్ళారు

కొంతసేపటికి వినుత తాళంచెవి

పట్టుకొచ్చింది. గేట్ను సమీపించగానే ఆ వ్యక్తిని చూచి నిశ్చేష్టితయైంది. కొంత సేపటికి తేరుకుని తాళంచెవి తాళంలో పెడ్తూ అంది, "మీరంతా పోయి ఆడు కోండి"- ఆమె కంఠంలోని తీక్షణతను గమనించి అందరూ పారిపోయారు.

ఆమె తాళంచెవి త్రిప్పలేదు.

"నువ్వెందు కొచ్చావ్?" అంది నిరసనతో.

"ఏంలేదు. చూచిపోదామని వచ్చాను వినుతా?" అతడి కంఠంలో ధ్వనించిన ఓ విధమైన ఓటమిని గ్రహించి చటుక్కున కళ్ళెత్తి చూచింది.

"ఒక్క క్షణం మాట్లాడి పోదామని వచ్చాను.... ప్లీజ్...." వేడికోలుగా అడగ్గానే ఆమె తాళంతీస్తూ అంది, "అంతా చిన్నపిల్లలు-పారిపోయి రోడ్ మీదికెళ్తారని తాళంవేశాను."

"ఇందులో పరాయి వాళ్ళెంతమంది?" లోపలికి వస్తూ అడిగాడు. ఆమె మళ్ళీ తాళంవేస్తూ, ఇద్దరు తప్ప అందరూ పొరుగింటిపిల్లలే."

ఇద్దరూ లోపలికెళ్తున్నారు. ఆమె ప్రక్కలో పరాయి వ్యక్తిగా నడుస్తోంటే అతనికి వింతగా ఉంది. వినుత మాట్లాడ లేదు.

ఇంట్లోకి వెళ్ళకుండానే ఆ చిన్న వరండాలోనే రెండు కుర్చీలు ఉంటే అందులో కూర్చున్నారు.

"మంచినీళ్ళిస్తావా వినుతా."

ఆమె తెచ్చి చిన్న స్టూల్మీద పెట్టి మళ్ళీ కూర్చుంది. ఆమె చూపులన్నీ పిల్లలమీద కేంద్రీకమై ఉన్నాయి. ఆమెను గమనిస్తున్నాడు. ఆరోగ్యంగా ఉంది. పాలిపోయిన ముఖంతో పీలగా రోగిష్టిలా లేదిప్పుడు. ఆరోగ్యంగా హుందాగా అందంగా ఉంది. ఔను, తను విన్న మాట నిజమే. వినుత సంతోషంగా ఉంది. ఎక్కడో ఈర్ష్య ఇంతై అంతై అతడి హృదయాన్ని ఆవరించింది.

అదే క్షణంలో వినుత అనుకుంటుంది. "బాగా చిక్కాడు. వెంట్రుకలు బాగా నెరిసి చాలా పెద్దవాడిలా కనిపిస్తు న్నాడు. ఆ కళ్ళలో కాంతిలేదు. వస్త్ర ధారణలో శ్రద్ధలేదు. అంటే అతడికి అంత నిర్లక్ష్యభావం ఉందన్నమాట... కానియ్. అలా జరగవలసినదే!" అను కుంది.

అతడు మంచినీళ్ళు త్రాగి సేదతీరి నట్లు "హమ్మయ్య" అన్నాడు.

"నువ్వొచ్చినపని త్వరగా చెప్పి వెళ్ళి పోతే నాకెంతో సంతోషం." అతడివైపు చూడకుండానే అంది.

"త్వరగా చెప్పి వెళ్ళటానికి అది ఒక చిన్న విషయంకాదు. నా ఈ జీవితంలో ఓడిపోయాను-"

"అది చెప్పటానికే వచ్చినట్లయితే- నేను విమర్శించను. నువ్వు గెలిచినా- ఓడినా అది కేవలం నీకు సంబంధించిన విషయం. నువ్వు గెలిస్తే నేను అసూయ

చెందను ఎందుకంటే భగవంతుడు నా జీవితంలో అమృతాన్ని చిలికించాడు నువ్వు ఓడితే ఆనందించను - దుఃఖించను ఎందుకంటే నువ్వు పరాయి మనిషివి. ఆ వీధిన పోయేవాడు నా కెంత అప్తుడో నువ్వూ అంతే." ఆమె కంఠంలో తేలికభావం వ్యక్తమైంది.

అతడు బాధపడ్డాడు. ఆమె తనను ఏనాడు 'అప్పుడు' కూడా ఏకవచనంతో సంబోధించలేదు. పోన్లే తను మాత్రం ఆమెను ఏం గౌరవించాడు కనుక — ఈనాడు ఇలా పిలవటానికి?"

ఆమె చటుక్కున లేచి నుంచుంది. "ఆ రోజుల్లో - ఎవడైనా పరాయి మగవాడు వచ్చి నాతో ఇలా మాట్లాడితే నువ్వు సహించలేకపోయేవాడివని నాకు తెలుసు. ఈ రోజు నా భర్త ఇంట్లోలేని సమయంలో నువ్వు వచ్చి కూర్చుని— మంచినీళ్ళు త్రాగి తేలికగా నీ గోడు వెళ్ళబుచ్చుకోవాలనుకుంటే-ఈ చర్య నాకిష్టం లేదు. వారు ఏడుగంటలకే వస్తారు. అప్పుడు వస్తే నిన్ను పరిచయంచేస్తాను. వారి సమక్షంలో మాట్లాడు. నాకేం అభ్యంతరంలేదు."

అతడు వాచీ చూసుకున్నాడు. "పావు గంట ఉంది."

"ఐతే .... అందాకా ఇక్కడే కూర్చో," అని ఆమె లోపలికి వెళ్ళి పోయింది

అతడు పిల్లల ఆటల్ని చూస్తున్నాడు

అను ఇక్కడికి రావటం ఉచితమైన పనేనా

వినుత — అతడు తనను అమర్యాదగా చూస్తే.

"ఉష్" తను సహించాలి తన జీవితమే తెగి తెగి ముక్కలై పోయిన త్రాడులా ఉంది. ఆ తునకల్ని తీసుకుని ముడులు వేయగల్గితే.... అంతకన్నా ఏంకావాలి. తన జీవితాన్ని చక్కబరుచుకోవాలన్న ఉద్దేశం తనకున్నది నిజమే అయితే తను కొన్ని అవమానాల్ని సహించగలడు. ఫరవాలేదు అది తప్పదు.

పిల్లలు 'నాన్నా' నాన్నా" అని అరవగానే వినుత తాళంతీసింది. ఎల్లలందరికీ తెలుసు - అది ఇళ్ళకు వెళ్ళే టైం అని. ఎవరి ఆట సరంజామా వాళ్ళు చంకల్లో పెట్టుకుని పరుగులు తీశారు

ఆఖరి పాపను వెళ్ళనిచ్చి అతడు గేట్ వేశాడు.

ఇక తాళం వేయనవసరంలేదు

పిల్లలు తండ్రిచేతులను పట్టుకుని నడుస్తున్నారు. పదేళ్ళ పెద్ద కుర్రాడు బంతి కొట్టుకుంటూ వరండా ఎక్కాడు ఆ నూతన వ్యక్తిని చూపుతూ అంది వినుత, "వీరు - మా ఊరివారంట తరువాత మాట్లాడుకుందాం. మీరు లోపలికి రండి"

నమస్కారాలైన వెంటనే అందరూ లోపలికెళ్ళారు. కొంతసేపైన తరువాత వినుత ఓ మగ్‌లో కాఫీతెచ్చి స్టూలు మీద పెట్టి వెళ్ళిపోయింది. అతడు వెంటనే త్రాగి పెట్టేశాడు.

దాదాపు పావుగంటతరువాత ఇద్దరూ వచ్చి కూర్చున్నారు.

"వీరిని మీకు ఎలా పరిచయం చేయాలో నాకు తెలియటంలేదు. ఒకప్పుడు ఇతడి ఇంట్లో ఉండేదాన్ని. ఆ తరువాత తరిమివేయబడి - త్యజింపబడ్డాను. ఏదో మాట్లాడాలంటే మీరు వచ్చేదాకా ఆగమన్నాను." పొడి పొడిగా అంది.

అతడు తనను ఎలా చూస్తాడో-! అన్న భయంతో ఆ వ్యక్తి నేలచూపులు చూస్తున్నాడు.

అతడు కూర్చున్న తీరు - అతడి వస్త్రధారణ — ముఖంలోని దైన్యత చూచి వినుత భర్త కుమార్‌కు జాలి వేసింది.

'పాపం - ఇతడు చచ్చినపాములా వున్నాడు,' అనుకున్నాడు. "ఓడిపోయాడు. అమృత కలశాన్ని కోరి బిద్దలు చేసుకున్నాడు... మరొక 'మగ' వాడు.... ప్చ్...." అనుకున్నాడు.

"నన్ను మీరు అసహ్యించుకుంటు...."

"లేదు.... లేదు.... జాలిపడ్తున్నాను." కుమార్ చటుక్కున అన్నాడు.

"ఔను .... ఒకప్పుడు అహంకారంతో .... విచ్చలవిడిగా ప్రవర్తించాను. ప్రతి చిన్నవిషయానికి పెడర్థాలు తీసి వినుతను సాధించాను. ఆమె అప్పటి అనారోగ్యానికి కారకుడినయ్యాను. భార్యగా ఆమె చిన్న చిన్న కోరికలకు కూడ చెడు అర్థాలు తీశాను. ఒక బానిసలా చూసుకున్నాను. ఆమె చదువుకున్నది. పని చేస్తానంటే అంగీకరించలేదు నేను. పోనీ నాకొచ్చే డబ్బుతో ఆమెను సరిగా పోషించలేక పోయాను. బాబు పుట్టినతరువాత కూడ నేను మారలేదు. ఒకరోజు నేను వచ్చేసరికి ఇల్లు తాళం వేసుంది. ఎక్కడికెళ్ళావని అడిగితే డాక్టర్ దగ్గరకంది. నేను నమ్మలేదు. ఆనాటినించి ప్రతి విషయానికి ఆరా తీయటం ప్రారంభించాను. హింసించాను. హీనంగా చూసాను. చివరికి ఆమె ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్న తరువాత చిక్కిశల్యమైన వెంటనే వాళ్ళ యింటికి తరిమేశాను. ఇలాంటి సమయంలో మనకు బుద్ధి చెప్పి సన్మార్గాన్ని అవలంబింపజేయ జూచేవారికన్నా వక్రమార్గాన్ని అనుసరించమని ప్రబోధించేవారి ప్రభావానికి లొంగిపోయాను. విడాకులిచ్చాను. బాబు నా అధీనంలోకి వచ్చాడు. కాని నాకెందుకు? మళ్ళీ పెళ్ళికి సిద్ధమౌతున్న నాకు నాలుగేళ్ళ పిల్లవాడెందుకు? నాలో లోపంలేదు. నేను పర్ఫెక్ట్ మగవాడిని. మంచివాడిని - ప్రేమ



జాలి – దయ అన్నీ నాలో ఉన్నాయి ఆమెలో అంతా చెడు ఉంది ఆమె నోటిలో విషముంది కల్మషంలో పుట్టి పెరిగింది నేనంటే ఆమెకు నిర్లక్ష్యం నన్నో భర్తగా గౌరవించని స్త్రీ బిడ్డ నా బిడ్డకాలేదు। అంసర్ది చెప్పుకుని బాబును పంపేశాను

అలా పంపుతున్నప్పుడు ఆనందించాను ఒక భారం వదిలిపోయిందని – స్వేచ్ఛగా జీవించవచ్చునని భావించాను బిడ్డను అక్కడికి పంపిన తరువాత వాడి పోషణార్థం కొంత డబ్బు పంపమని వాళ్ళ తాతగారు రాస్తే దానికి నేనిచ్చిన జవాబు వింటే మీరు ఆశ్చర్యపోతారు – అసహ్యించుకుంటారు

"లేదు మీలాంటివారు ఎది చేసినా ఆశ్చర్యంగా ఉండదు ఆశ్చర్యం కల్గించిందేమిటంటే మీరిక్కడికి రావటమే" కుమార్ అన్నాడు

"చెప్తాను దీనికి ముందు కొంత పరిచయం మీ కవసరం ఇష్టముంటే ఉంచుకుని సాకండి–లేకపోతే ఏ శరణాలయంలోనో చేర్పిస్తాను – అని రాశాను ఆ తరువాత వారినించి ఉత్తరాలు లేవు మూడునెలలు గడిచిపోయాయి ఆ తరువాత వారినించి ఒక ఉత్తరం దాంతో పాటు కొన్ని పత్రాలు వచ్చాయి వాడిని ఆయన దత్తు తీసుకొంటారట సంతకాలు పెట్టి అలా ఇవ్వటం నాకు ఇష్టమేనని వ్రాత పూర్వకంగా తెలియ

జేయమన్నారు సంతకాలు పెట్టి వెంట వెంటనే ఉత్తరంరాసి పోస్టుచేశాను ఆ నాడు నేననుభవించిన ఆనందం పైశాచిక మైనదని ఆ తరువాత గ్రహించా నను కోండి ఇలా జరిగిన ఏడాదికంతా నాకు ప్రమోషన్ వచ్చింది అసిస్టెంట్ ఫోర్‌మాన్ అయ్యాను జీతం ఎక్కువంది తల్లి సంద్రులకు వంచ పంపితే మిగిలిన దంతా నాకే ఉంటుంది అప్పుడు ఒంటరి తనం అనిపించింది పునర్వివాహం చేసు కోవాలని అనుకున్నాను అఫ్‌కోర్స్ వినుతను వెళ్ళగొట్టినప్పటినుండి ఆ కోర్కె ఉందనుకోండి ఈ పూటు నేను చేసుకొనబోయే అమ్మాయి ఎక్కువగా చదివి ఉండకూడదు - పల్లెటూరి పిల్ల - ఘోషాలో ఉండే పిల్ల - నా సరదాలకు అడ్డు తగలకూడదు - నన్ను భర్తగా దైవంగా భావించి తదనుగుణంగా నన్ను మన్నించే స్త్రీని వెదికి చేసుకోవాలను కున్నాను అలాగే చేసుకున్నాను ఆమె విజయలక్ష్మి కాని నేను వేసిన అంచనా తారుమారైంది " అతడు అపుజేసి మగ్‌లో ఓమారు చూసి మళ్ళీ పెట్టే శాడు

"అంటే ఆమెకూడా వినుతలాటి దేనా?"

రాజు అడ్డంగా తలాడించాడు "ఉహూ నేను ఏ లక్షణాలను కోరానో అవన్నీ వినుతలోనే ఉన్నా యని ఆ తరువాత తెలుసుకున్నాను. విజయ స్వేచ్ఛాజీవి చాలా అధునాతన భావాలుకలది అపారమైన తెలివితేటలు కలది నన్నూ, నాలోని బలహీనతల్ని విశాలహృదయంతో అర్థంచేసుకోగల సంస్కారం ఆమెలో ఉంది పల్లెటూరి పిల్లలో ఈ లక్షణాలెలా వచ్చాయని ఆశ్చర్యపోయి ఓ మారు అడిగాను నా వైపు అదోలా చూసి నవ్వింది పల్లె టూళ్ళో నేను మనుషులమధ్య పెరిగాను' అంది అంతే అంటే ఏ వ్యక్తుల ప్రభావం ఆమెపై ప్రసరించిందో ఆ వ్యక్తులు ఉన్నత భావాలు కలిగినవారై ఉండాలన్న మాట ఒకసారి నేను ఇంటి కొచ్చేసరికి తలుపు తాళంవేసుంది చాలా కోపం వచ్చింది రాగానే క్రోధంతో కొట్టినంత పని చేశాను నా ఉద్రేకం కాస్త చల్ల బడిన తరువాత నిరసనతో అంది, "ఎక్కడికి ఎందుకెళ్ళావు' అన్ని ప్రశ్న వేయకుండానే ఇలా ప్రవర్తిస్తున్నారు స్త్రీ ఇల్లు కదిల్తే చెడ్డపని చేయటానికే వెళ్ళిందనుకునే మీ సంకుచిత మనస్త త్వాన్ని ఏమనగలను మనం మనుషుల మధ్య నివసిస్తున్నాము ఒకరి సహాయం లేకుండా రోజు గడవటం కష్టం ఆడ వాళ్ళు మగవాళ్ళు అన్న దృష్టితో చూస్తే ఈ జీవితం సాగిపోవటం కష్టం స్త్రీ చెడిపోవాలంటే ఇల్లుకదిలి ఎక్కడికో వెళ్ళనవసరంలేదు నేను అలాంటి దాన్నయితే ఇలా తాళంవేసి ఆలస్యంగా రానవసరంలేదు," అంది రాను రాను

ఆమె నన్ను మార్చాలని చూసింది. నా వ్యసనాల్ని ఖండించటం ప్రారంభించింది. ఆమె ప్రవర్తన నాకు వింతగా వుండేది. ప్రథమంలో సహించినట్లు మౌనంగా ఉండేది. ఆ తరువాత జ్యోకం కల్గించు కోవటం ప్రారంభించింది – అదీ అధి కారంతో! ఒకసారి కొట్టాను..... 'శరీరా నికి దెబ్బతగిల్తే— అది కొంత కాలా నికి మానిపోతుంది.... ఈ హృదయా నికి తగిల్తే.... అది ఇక మానదు'అంది. తరువాత ఓ విధమైన సత్యాగ్రహం ప్రారంభించింది. నాకు మాత్రం అన్నం వండి వడ్డించేది. ఇదొక నాటకం అను కున్నాను. నన్ను పోనిచ్చి వండుకు తిన వచ్చు- పాలు త్రాగవచ్చు. కాని మూడవరోజున వట్టి కాఫీతో ఉండలేక పోయింది. నీరసంతో పడిపోయింది. అప్పుడు తెలుసుకున్నాను ఆమె గర్భ వతి అని. కాని నాలో కలుగవలసిన ఆనందమే కల్గలేదు! నేను ఆమె చేతిలో కీలుబొమ్మనై పోతున్నానా? నేను మారి పోతున్నానా? నా వ్యక్తిత్వానికే గొడ్డలి పెట్టు! ఓ విధమైన రాక్షసత్వం నాలో ప్రవేశించింది. హఠాత్తుగా నాలోని నిగ్రహం కట్టలు త్రెంచుకుంది. నేను ఆమెకు లొంగిపోయి నా మగతనాన్ని బలిపెడ్తున్నానా? నాలోని అహం ఉన్నత స్థాయినందుకున్నది. ఒకనాడు నెల రోజులు సెలవుపెట్టి ఒక్కడిని మా ఇంటికెళ్ళాను జయ ఒక్కత్తె ఇంట్లో ఎలా ఉందోనన్న ఆందోళన ఉన్నప్ప టికి ఆమెకొక గుణపాఠం నేర్పాలన్న బలీయమైన కారణం ముందు అవన్నీ లెక్కలోకి రాలేదు. నెలరోజులకు నేను తిరిగి వచ్చాను. ఆమె తలుపు తీసి చిరు నవ్వుతో స్వాగతంచెబుతుంటే నా హృద యంలో అగ్నిజ్వాలలు రేగినై. ఆమె మామూలుగా ఆరోగ్యంగా నిండు కుండలాఉంది. లోపల చిన్నరకం సందడి విన్పిస్తోంది. ఆమెను త్రోసుకుని లోపల కెళ్ళాను. నలుగురు అమ్మాయిలకు ట్యూషన్ చెబుతోందికాబోలు! పుస్తకం తీసి చూసాను ఎనిమిదవ తరగతి పుస్త కాలు అందునా ఇంగ్లీషు లెక్కలు....

నేను అక్కడినుండి వెళ్ళిపోయాను. పిలల్ని పంపించే కాఫీ తెచ్చింది.

"నీవు బడికి వెళ్ళలేదనుకున్నాను! నువ్వు చదివింది ఐదవక్లాసన్నావుకదూ?" తప్పుచేసిన స్కూలు పిల్లాడిని మేష్టారమ్మ చూచినట్లు చూసింది.

"నేను చదివింది ఐదవక్లాసే. కాని ఇంట్లో బాగా చదువుకున్నాను. మీరు ఒప్పుకుంటే మెట్రిక్ రాయగలను. రాయనా?"

ఆ కాఫీ విసరికొట్టి బైటికెళ్ళాను. క్రూరమైన చేష్టలకు ఆమె ఇలాంటి లొంగుతుందనుకున్నాను. విసిగిపోయి నల్లిలాఅణగి మణగి ఉంటుందను కున్నాను.

మరుసటిరోజు నేను డ్యూటీలో జాయినవ్వాలి నాతోపాటు తనూ

ఫోంచేసింది. "ఎక్కడికి" అన్నాను. "ఆ పై వీధిలో ఒకావిడ లెక్కలు నేర్పుతుంది. మెట్రిక్‌కు కట్టాలని."

"మానెయ్‌-" అన్నాను. డబ్బు ముప్పై కట్టానంది. ఫరవాలేదన్నాను. నవ్వింది. నెలరోజులు నేనేమైపోయినా ఫరవాలేదన్నట్లు వెళ్ళిపోయారే! ఆ రోజుల్లో నే నేం చేసేదాన్నో ఎలా కాలం గడిపేదాన్నో - ఎలా వండుకు తినేదాన్నో అనారోగ్యంగా ఉంటే ఏంచేసేదాన్నో మీకు పట్టలేదే! ఈ రోజు ఆ నెల రోజులైనా పాట్లను నా ప్లేన్లను మార్చాలని చూస్తుంటే పిచ్చిగా నవ్వు వస్తోంది.

"పిచ్చి పట్టనీ - నవ్వుకో.... కాని నువ్వు వెళ్ళటానికి వీల్లేదు."

"మీరు నన్ను పంపకపోతే- ఆమె అనుకుంటారు.... మీరు - నన్ను ఇంట్లో బలవంతంగా ఉంచేశారని. అందునా మీ గురించి ఇక్కడ ఎవ్వరికీ సదభిప్రాయం లేదుకదా! మూడునెలలే - ఆ తరువాత ఎలాగూ వెళ్ళలేను. నమ్మకం కుదరకపోతే వచ్చిచూడండి." నేన్లేనప్పుడు ఆ నల్గురు పిల్లల్లో ఇద్దరు పిల్లలు సాయం పడుకునే వారట! నేను లేకపోయినా ఆమె జీవితం సాఫీగా నడిచింది. లోలోపల ఎక్కడో తృప్తిగా ఉంది. కాని -కాని అదే భావం- ఉద్ధృతమైంది .... ఆ సాయంత్రమే మంచి మాటలతో నచ్చజెప్ప చూసాను... "మీరనేదేమిటి? ఇంట్లో పడి ఉంటే నాకు తిండికి- బట్టకు - లోటుండదనేకదూ? నాకు కావలసింది తిండి - బట్ట - రక్షణ మాత్రమే కాదు.... నా హృదయంలోని భావాలకు రూపకల్పన ఇవ్వాలన్న కాంక్ష ఉంది. వివాహపూర్వం నేనొక చిన్ని పిట్టను. నా అందమైన రెక్కల్ని విదిలించి హాయిగా స్వేచ్ఛగా గగనమార్గాన ఎగురుతూ ఆ మేఘమాలికలతో దోబూచులాడుతూ నా రెక్కల అందాన్ని చూసుకుంటూ చల్లటి స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ విహరించాలన్న తీరని కోరిక ఉండేది. మీ భార్యనైన వెంటనే నాకు కొంత స్వేచ్ఛ వచ్చిందన్న ఆనందం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. నేను కోరేది మీ నీడలో స్వేచ్ఛ. మీ పూర్వ చరిత్ర నాకేమీ తెలియదు. నా భర్త ఉద్యోగం చేస్తున్నాడు - అతడికి దుర్వ్యసనాలేవీ ఉండకూడదు - అతడు స్త్రీని ఆటవస్తువుగా లేక బానిసగా లేక ఖైదీలో ఉంచినట్లు చూడకూడదు. ఆమె వ్యక్తిత్వానికి గౌరవం ఇచ్చి ఒక స్నేహితురాలిగా భావించాలి. అతడి సాహచర్యంలో ఆమె వ్యక్తిత్వం పరిపూర్ణత చెందాలి. ఇలాంటి భావాల పరిపూర్ణతే నా భర్త అనేవాడిలో ఉండాలనుకున్నా. కాని మీరు అందుకు భిన్నంగా ఉన్నారు. అది నా దురదృష్టం. నన్ను బంధించకండి... అది ఉరిత్రాడవుతుంది. నన్ను అదిమి పెట్టకండి.... ఆ బరువు క్రింద అణిగి నశించిపోతాను." ఆ అవిచలిత గంభీర ముఖాన్ని చూచి

ఆశ్చర్యపోయాను. ఆమె ఎటువంటి స్వేచ్ఛను గూర్చి ఇంతసేపు వ్యక్తీక రించిందో ఆ స్వేచ్ఛకు క్షుద్ర చౌకబారు అర్థాన్ని స్ఫురింపచేసేస్తూ కాఠిన్యాన్ని జతపర్చి ఆమెను అఘాతపర్చటానికి వెనుదీయలేదు. చివరికి అణ్వాస్త్ర ప్రయోగంచేశాను. 'నీ ఇష్ట ప్రకారం నువ్వు మసలుకో. నా ఇష్టానుసారం నేను మసలుకుంటాను.' బహుశః ఆమె కోరికలన్నీ - ఆ తీవ్రమైన అగ్ని జ్వాలలలో కాలి నుసైపోయి వుంటాయి. ఆమె మరి మాట్లాడలేదు. నేను విజయ గర్వంతో ఛాతీ విరుచుకుని తిరిగినంత పని చేశాను. ఆ ఛాతీ విరుపులో వ్రక్క లైన హృదయాన్ని చూడలేకపోయాను. ఆమె మారిపోయింది. నేను ఆశించి నట్లుగా మారిపోయింది. ఆ రోజు పేకా టలో కూర్చుని ఆలస్యంగా ఇల్లుజేరాను. తలుపుతీసి నన్ను లోపలికి రానిచ్చి వెంటనే తలుపుమూసి తలుపుమీద ఆను కుంది. ఆమె కళ్ళు విస్ఫులింగాలే అయినై. 'దీని అర్థం ఏమిటి నీ ఇష్టాను సారం నువ్వు - నా ఇష్టానుసారం నేను అన్నారు .... నేను గ్రహించాను కనుక మీ ఇష్టానుసారం మసలుకుంటున్న ప్పుడు - మీరు నా ఇష్టానుసారం మసలు కోవాలని ప్రత్యేకంగా చెప్పించుకోనవ సరం లేదనుకుంటాను....' నేను నిర్ల క్ష్యంగా నవ్వి వెళ్ళిపోయాను. ఆ తరు వాత మా మధ్య ఎటువంటి సంఘర్షణ లేకపోయింది.... కాని ఆమెః కాలం గడిచేకొలది మరింత మరింత తనలోకం లోకి అదృశ్యురాలవటం మొదలు పెట్టింది. నెలలు నిండుతున్నాయి. లేడీ డాక్టర్ ఆమెను పరీక్షించి అంతా బాగున్న దని చెప్పేది. కొద్ది కొద్దిగ నేనే మారాను. షాప్‌నించి తిన్నగా ఫైంకు ఇంటికొచ్చేవాడిని. కేరంబోర్డు తెచ్చాను. ఆడేవాళ్ళం. సరదాగానే ఉన్నట్లు కనబడేది. మా పెళ్ళయిన నాల్గు సంవత్స రాల రెండు నెలలకు విజయకు పాప పుట్టింది.... పురిటిలోనే పిచ్చిపట్టింది.... అలా ఉండి రాను రాను తగ్గిపోతుంది... కాని.... ఆ పాప...."

అతడు- ఆపుచేశాడు. కంఠంలో పెద్ద గులకరాయి ఇరుక్కుపోయినట్లు బాధ పడసాగాడు. వినుత మంచినీళ్ళు తెచ్చి స్టూలుమీద పెట్టింది. రాజు గటగట త్రాగి పెట్టేశాడు.

"ఆ పాపకేమైంది?" వినుత ఆందో ళనతో అడిగింది.

"ఆ పాప... అంతా బాగానేఉంది... ఆరోగ్యంగా చక్కగా ఉంది.... కాని.. మీరు వినిఉండరు. ఈ ఘోరం మీరు విని సహించలేరు.... చచ్చిపోయినా బావుండేది.... కాని భగవంతుడు నా పాపాలకి ఈ విధంగా శిక్షించాడు.... విజయ వారంరోజుల్లో చనిపోయింది. సాధారణంగా ఇలాంటి కేసుల్లో మరణించ రట. కొన్ని మాసాలకు మామూలుగా

అయిపోతారట. పాపసంగతి తెలియక ముందే ఆమె పోయింది .... అసలు మతి స్థిమితంలేదు.... ఇంకేం అర్థం చేసుకోగలదు! తెలిసి బ్రతికి ఉంటే ఆ పిచ్చి నిల్చిపోయేదనుకుంటాను. ఐనా ఆ పాపమీద జాలి-ప్రేమ నాకెప్పటి నించి కల్గాయి! నాకే ఆశ్చర్యంవేసింది... లాభంలేదు.... ఆ పాపని.... చంపేసుకున్నాను...."

"ఆ!" అన్నారు ఇద్దరు.... దాని అర్థం ఏమిటో!

రాజు తల రెండు చేతుల్లో పట్టుకున్నాడు.... చూపులు నేలను అనినై. వినుత, కుమార్ ముఖాలు చూసుకున్నారు.... "పాపకేమైంది.... ఎక్కడుంది?"

"పాప ఎక్కడో క్షేమంగానే ఉండి ఉంటుంది. హాస్పిటల్‌లో రెండు వారాలుంచుకుని అన్ని పరీక్షలుచేసి చివరికి నన్ను ఒప్పించి వాళ్ళకిచ్చేశారు."

"మళ్ళీ అనాధశరణాలయానికే ఇచ్చేశారా?" వినుత క్రోధంతో పెదిమలు బిగించి ఊసినట్లు అడిగింది.

తలెత్తి జాలితో ఆమెవైపు చూసాడు. అతడి కళ్ళలో కన్నీళ్ళు సుళ్ళు తిరుగుతుండగా చటుక్కునకళ్ళు దించేశాడు... కాదన్నట్లు తలాడించాడు.

"పాపని ప్రపంచానికి చనిపోయినట్లు చూపారు. నపుంసకులు తీసుకెళ్ళిపోయారు."

"ఆ.... ఏమిటీ!" అన్నారు... దాని అర్థం హృదయంలోకి సోకి వేయి శరాఘాతాలకు లోనైనట్లు బాధతో మూల్గారు. వినుత అక్కడినించి పారిపోయింది.

కుమార్ కాస్త దగ్గరకు జరిగి రాజు భుజంమీద చేయివేశాడు. ఆ స్పర్శకు రాజులో నిబిడీకృతమైన దుఃఖం ఒక్కసారి వెల్లువలై పారింది. రెండుసార్లు వెక్కి చటుక్కున నోట్లో రెండువ్రేళ్ళు పెట్టుకుని అణచుకున్నాడు. కొంత సేపటికి నిట్టూర్చాడు.

"ఆ ఇంట్లో తిరగలేకపోయాను. జయను పోగొట్టుకున్న తరువాత ఆమె విలువ తెలుసుకున్నాను. ఆ వెలితి నాకు సహింపరానిదైంది. ఆమె పోయింది ఒకందుకు మంచిదే - ఎందుకంటే పాప విషయం తెలిసి నార్మల్‌గా అవలేక పోయేది. అక్కడినించి బదిలీ చేయించుకుని విజయవాడ కొచ్చాను. కొన్నాళ్ళకు మా తండ్రిగారు పోయారు. అక్కడ వినుత తండ్రిని కలుసుకున్నాను. ఆయనకు నా మీద కోపంలేదు. నన్ను చాలా గౌరవంగా పలుకరించారు. తర్వాత మెల్లగా మీ గురించి చెప్పారు, మీకు మొదటి భార్యవల్ల ఒక కొడుకు ఒక కూతురు అని. ఎంతో బ్రతిమాలగా మీ అడ్రస్ ఇచ్చారు. ఇక్కడికి రావటానికి ఏడాదిపట్టింది. ధైర్యం చాలలేదు, ముఖంచెల్లక! ఎంతో ఆలోచించి ఇవ్వాళ బయలు దేరాను."

"మీరు పునర్వివాహం చేసుకున్నారా?"

"లేదు.... చేసుకోవాలని లేదు."

"అలా అనకండి. ఒంటరిగా ఉన్నారు బాధ్యతా రహితంగా ఉండటం కూడా మంచిదికాదు. చేతి నిండుగ పని ఉండాలి. చూడమంటే చూస్తాను."

"వద్దు. భార్యను ఏ విధంగా చూసుకోవాలో నాకు తెలియదు. రెండుసార్లు ఓడిపోయాను. అహం అనర్థానికే దారి తీస్తుందని తెలుసుకున్నాను."

"తెలుసుకున్నారు కనుకనే మీ అహాన్ని పారద్రోలండి. మీ భార్యగా అర్థాంగిగా గ్రహించండి. ఆప్తురాలిగా, స్నేహితురాలిగా గౌరవించండి. ప్రేయసిగా ప్రేమించండి. మిలిటరీ వాళ్ళలా క్రమశిక్షణలో ఉంచాలని ప్రయత్నించారు మీరు. మీకు కావలసింది భార్యే కాని నమ్మకమైన పనిమనిషి కాదు ఆమె ఒక యంత్రంలా ఉండాలను కోకండి. ఆమె స్వతంత్ర భావాలను ఖండించకండి. ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవిస్తే ఈమారు ఓడిపోరు."

"చాల థాంక్స్.... కాని నా మనసు విరిగిపోయింది. పాప ఆ విధంగా అయిపోవటంతో నాలో విప్లవం చెలరేగింది. నా హృదయం నలిగిపోయింది. అందుకే మీ దగ్గరకు వచ్చాను. ఎంతో విశాల హృదయంతో విడాకులు తీసుకున్న వినుతను - పెళ్లిచేసుకోగల్గారు. ఆమె జీవితాన్ని ఆనందమయం చేశారు. మీకు నా కృతజ్ఞతలు. మరో విషయంలోకూడా మీ విశాల హృదయంతో నాకు సహాయం చేస్తే ...." రాజు ఆపుచేశాడు.

కుమార్ ఉ - ఆ - అనలేదు. మౌనం దాల్చాడు. ఇతడు దేనికోసం వచ్చాడు? ఎన్నో అనుమానాలు - అతడు ఆలోచిస్తున్నాడు

వినుత వచ్చి భోజనానికి పిల్చింది

రాజు వద్దన్నాడు కాని కుమార్ ఒప్పుకోలేదు అన్నీ బల్లమీద ఉన్నాయి వినుత వడ్డించటానికి అక్కడ నుంచో లేదు

భోజనానంతరం మళ్ళీ బైటికొచ్చి కూర్చున్నారు ఈ మారు అరగంట వరకు లోకాభిరామాయణం మాట్లాడు కున్నారు

ఎనిమిదిన్నర అయింది "వినుతగా రొస్తే నా కోరిక చెబుతాను మీ ఇష్టం"

కుమార్ వినుతను పిల్చాడు ఆమె భోజనం అయింది పిల్లల్ని నిద్రపుచ్చి వచ్చి కూర్చుంది

"చెప్పండి కాని ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి మీ కోరిక ఏదో మాకు తెలియదు ఇక్కడ మీకు సంబంధించినవి ఏమీ లేవు ఒక్కటి తప్ప అది పెద్ద బాబు చంద్రశేఖర్ గురించి అయితే మీరు అడక్కుండా ఉంటేనే మంచిది వాడికి పదోయేడు అతడు ఒక్కొక్కటి అర్థంచేసుకోగల వయసులో ఉన్నాడు మీరే చెప్పారు వ్రాతమూలకంగా సర్వ హక్కులు వదిలేసుకున్నట్లు - మామ గారికి దత్తతకు ఇచ్చినట్లు "

రాజు దీర్ఘాలోచలో మునిగిపోయాడు

మెల్లగా లేచి స్తంభానికి ఆను కున్నాడు ఆ క్రీనీడలో అతడి ముఖకవళి కలు స్పష్టం కాలేదు

"మీ ఊహ సరియైనదే కాని బాబును తిరిగి ఇమ్మని అడగటానికి రాలేదు కాని అప్పుడప్పుడు చూచి వెళ్ళటానికి అనుమతి యిస్తారా? వాడికోసం ఏదైనా ఇస్తే మీరు స్వీకరి స్తారా?"

"జీవితంలో సర్వం నాశనమైనట్లు ఎందుకు ఫీలవుతున్నారు? మీకు మంచి అమ్మాయిని తెచ్చి పెళ్లిచేసే బాధ్యత నాది " కుమార్ సీరియస్‌గా అన్నాడు.

రాజు నవ్వాడు "మీకు అర్థంకాలేదు... పాపకు అలా అయింది విజయ చనిపోయింది నాలో నేను లేను అలాం టప్పుడు వారి కోటాలో నన్ను చేర్చి ఆప రేషన్‌చేసి డబ్బు పంచుకున్నట్లున్నారు."

"మైగాడ్!" కుమార్ కంఠంలోంచి వేదనా పూర్వకంగా ఈ మాటలు వెలువడినై

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచినై. వినుత భర్తకేసి నిశితంగా చూచింది. ఆ తరువాత కళ్ళలో నీళ్ళు తిరిగినై. మెల్లగా లేచి వెళ్ళిపోతూ మెల్లగా అంది "మీ నిర్ణయమే నా నిర్ణయం"

కుమార్ రాజును సమీపించి భుజం మీద చేయివేశాడు

"మిమ్మల్ని నా అన్నగారుగా బాబుకు పరిచయంచేస్తాను అప్పుడప్పుడు వచ్చి చూచి వెళ్ళండి మీరు ఏది ఇచ్చినా స్వీకరించటానికి అభ్యంతరంలేదు. కాని మీ గతాన్ని వాడి ముందు రహస్యంగా ఉంచుతానన్న మాట నా కివ్వాలి" కుమార్ దృఢంగా అన్నాడు.

"కుమార్‌గారూ మాట కాదు నా రక్తంతో వ్రాసి ఇమ్మన్నా ఇస్తాను మరొకసారి నా హృదయపూర్వక కృతజ్ఞతలు రేపొస్తాను నమస్కారాలు "

రాజు హోటల్ కెళ్ళి స్నానంచేసి హాయిగా పడుకున్నాడు హాయిగా నిశ్చింతగా నిదురపోయాడు.

ప్రాతఃకాలమే లేచి నీటుగా తయారై పళ్లూ, మిఠాయిలు కొనుక్కొని వినుత యింటికెళ్ళాడు

కుమార్ ఎదురెళ్ళి రాజును తీసుకొచ్చాడు

ముగ్గురు పిల్లల్ని పిల్చి నామకార్థ పరిచయంచేశాడు.

"మా అన్నయ్య . దూరదేశంనించి వచ్చాడు. పెదనాన్నగారు "

రాజు దృష్టి చంద్రశేఖర్ మీద నిల్చిపోయింది

చేతులు చాపి ముగ్గుర్నీ తన హృదయంలోకి తీసుకున్నాడు ఆ పరిష్వంగ సుఖం దేనికి సాటి ! ఎడమ చేతితో బాబు వెన్నురాస్తూ కళ్ళుమూసుకుని మైమరచిపోయాడు బాబుకు సిగ్గుగా వుంది. విడిపించుకుని దూరంగా జరిగాడు

"కూర్చోండి " కుమార్ అనగానే ముగ్గురూ కూర్చున్నారు

"నిన్న చెప్పలేదేం." శేఖర్ అడిగాడు

"ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం బాబూ. ఆలస్యమైపోయింది. మళ్ళీ వస్తాగా - ఉట్టి చేతులతో పిల్లల్ని చూడకూడదని వెళ్ళిపోయాను." రాజు చెప్పాడు

"ఆంటి అదే పెద్దమ్మను తీసుకు రాలేదా ?" శేఖర్ అడిగాడు

"లేదు బాబూ దేవుడు తీసుకెళ్ళిపోయాడు నా కెవ్వరూ లేరు "

"పాపలు లేరా?" చిన్నది ఆరిందాలా అడిగింది

"ఎందుకు లేరూ నువ్వున్నావుగా" అంటూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు

అందరితోపాటు టిఫిన్ తిని అందరికీ చెప్పి వెళ్ళిపోయాడు అంతసేపు వినుత దూరంగానే ఉండిపోయింది.

తండ్రి కొడుకును దగ్గరకు తీసుకోవటం ఆమె చూడలేదు

వెళ్ళిపోతున్న రాజువంక చూస్తూ నిట్టూర్చాడు కాని అంతలోకి రాజు నడుస్తోన్న తీరులో భేదం కనిపించింది

గేట్‌ను అనుకుని చూస్తున్నాడు.

పితృప్రేమ అనేది అతడి శరీరమంతటిలోను - అంతర్యంలోను అణువణువునా నిండిపోయినట్లుంది స్థిరచిత్తుడై తలపైకెత్తి చకచక నడుస్తూ ముందుకు సాగిపోతున్నాడు

ఠీవిగా హుషారుగా సాగిపోతున్న రాజును చూచి అనుకున్నాడు—ఏ సాంత్వనను ఆశించి వచ్చాడో అది లభించింది.